క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చింతకాని: మండలంలోని నాగులవంచ గ్రామంలో లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్య బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం భట్టి సిఫారస్సుతో మంజూరైన రూ. 2.79లక్షల చెక్కులను అందించారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్రం, బసవయ్య, మంగపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ



జీలుగులు అందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల సహకారసంఘంలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై జీలుగు విత్తనాలు సొసైటీ అధ్యక్షుడు బోయినపల్లి వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కావాలిసిన జీలుగులు సొసైటీలో కొరత లేకుండా అందుబాటులో ఉన్నాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ త్రివేణి, సీఈఓ ఉమామహేశ్వరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

చింతకాని: మండల పరిధిలోని నాగులవంచ రైల్వేకాలనీ గ్రామానికి చెందిన సోంపోగు శ్యాంసుందర్, లేతాకుల గోపయ్య ఇద్దరి వ్యక్తులపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో బుధవారం ప్రత్యేకాధికారి ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తుండగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు సర్వేలో పాల్గొన్నారు. ఇందిరమ్మ కమిటీలో సభ్యుడిగా ఉన్న కాంపల్లి శేషగిరిరావు శ్యాంసుందర్, గోపయ్య ఇరువురు అసభ్య పదజాలంతో దూషిస్తూ చేతులతో నెట్టి సర్వే చేస్తే చంపుతామని బెదిరించారు. బాధితుడు శేషగిరిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

13 నుంచి అమ్మమాట - అంగన్‌వాడీబాట

ఏన్కూరు: ఈ నెల 13 నుంచి అమ్మమాట - అంగన్‌వాడీబాట కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి తెలిపారు. గురువారం స్థానిక రైతు వేదికలో అంగన్‌వాడి టీచర్లు, ఆయాలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బేటి బచావో బేటి పడావో, లైంగిక వేధింపులు నిరోధక చట్టం 2013 తదితర వాటి గురించి వివరించారు. వీటికి సంబంధించిన పోస్టర్లను వివిధ శాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భవాని, బక్కమ్మ పాల్గొన్నారు.

నూతనకల్ పంచాయతీకి ఫ్రీజర్‌బాక్స్ వితరణ



ఫ్రీజర్ బాక్స్ అందిస్తున్న సందీప్ తదితరులు

తల్లాడ: మండలంలోని నూతనకల్ గ్రామానికి చెందిన శెట్టిపల్లి సందీప్ ఆ గ్రామ పంచాయతీకి ఫ్రీజర్‌బాక్స్ వితరణగా అందజేశారు. తన తండ్రి శెట్టిపల్లి వెంకటేశ్వరరావు గత ఏడాది మృతి చెందాడు. గురువారం ఆయన ప్రథమ వర్ధంతి సందర్భంగా లక్ష రూపాయలు విలువ చేసే ఫ్రీజర్‌బాక్స్‌ను సందీప్ గ్రామ పంచాయతీకి అప్పగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేశుల రవి, నలజాల శ్రీనివాసరావు, శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, తోట శ్రీకాంత్, చారి, చెరుకూరి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

బోనకల్: మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం విద్యుత్ వినియోగదారులకు సదస్సు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్లు ఏ.రమేష్, వేణు గోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు తమకు ఉన్నటువంటి అనుమానాలను పరిష్కరించుకోవచ్చన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు తెలిపారు.

బోనకల్ మండలంలో పత్తిసాగు కోసం అచ్చుతోలుతున్న రైతు



విత్తనాలు వేస్తున్న కూలీలు





మొలిచిన పత్తిచెట్లు

విస్తారంగా పత్తిసాగు

వర్షాల రాకతో ముందస్తు సాగు
- దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు
- మొలకలు వచ్చిన పత్తి
- నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ అధికారుల నిఘా..

బోనకల్: ఈ ఏడాది రోహిణికార్తె కంటే ముందే తొలకరి జల్లులు పడడంతో అన్నదాతలు ముందస్తుగా పత్తిసాగు చేపట్టారు. వేసవిలోనే దుక్కులను సిద్ధం చేసుకున్న రైతన్నలు పొడి దుక్కిలోనే విత్తనాలను విత్తారు. మే నెలలోనే వారం రోజులపాటు వర్షాలు ముమ్మరంగా కురవడంతో ముందు విత్తిన పత్తి విత్తనాలు మొలకలు వచ్చాయి. గత ఏడాది రబీలో వేసిన మొక్కజొన్న పంట మార్చి నెలలోనే చేతికి రావడంతో రైతులు ముందస్తుగానే దుక్కులు తయారుచేసుకున్నారు.

20వేల ఎకరాల్లో పత్తిసాగు..

మండలవ్యాప్తంగా 20వేల ఎకరాల్లో పత్తిపంట వేయనున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనాలు వేశారు. దీనికితోడు కేంద్రప్రభుత్వం పత్తికి మద్దతు ధరను క్వింటాకు రూ.589లు పెంచింది. గతంలో మద్దతు ధర క్వింటాళ్లకు రూ.7,521 ఉండగా ప్రస్తుతం రూ.8,110లుగా నిర్ధారించింది. దీంతో అన్నదాతలు ఈ ఏడాది ఎక్కువ మొత్తంలో పత్తిపంట వేసేందుకు సిద్ధమయ్యారు. వరి పొలాలను కూడా దున్ని జీలుగులు, పిల్లిపెసర, జనుము లాంటి విత్తనాలను భూసారం పెంచేందుకు వేశారు. కొంతమంది రైతులు దుక్కులలో మొక్కజొన్న దంటులను ఏరి చెత్త లేకుండా శుభ్రంగా తయారు చేస్తున్నారు. జూన్ 10 తరువాత వేయాల్సిన పత్తిపంటను 20 రోజులు ముందుగానే రైతన్నలు వేశారు.

నకిలీ విత్తనాలు రాకుండా చర్యలు..

ఈ ఏడాది నకిలీ విత్తనాలు విక్రయించకుండా ప్రభుత్వం టాస్క్‌ఫోర్స్ టీమ్‌లను ఏర్పాటు చేయడంతో అన్నదాతలకు కొంతమేర ప్రయోజనం చేకూరింది. ప్రభుత్వ అనుమతి ఉన్న షాపుల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని వ్యవసాయ అధికారులు సూచించడంతో బహిరంగ మార్కెట్లో నకిలీ విత్తనాలను కొనుగోలు చేయకుండా రైతులను చైతన్యపరిచారు.

ముందస్తుగానే పత్తిసాగు..



నేను 5 ఎకరాల్లో పత్తిసాగు చేశాను. ఈ ఏడాది తొలకరి వర్షాలు మే నెలలోనే పడడంతో ముందస్తుగానే పత్తి సాగు చేశాను. వేసవిలోనే దుక్కులు సిద్ధం చేసి పొడి దుక్కిలోనే గింజలను విత్తడంతో వర్షానికి పత్తి మొలవడంతో ఆనందంగా ఉంది.

– షేక్ మిస్రీ, రైతు, ముష్టికుంట్ల

జూన్ 10 తరువాత సాగు చేయాలి..



ఖరీఫ్‌లో సాగుచేసే పత్తి జూన్ 10 తరువాత వేయడం వలన వాతావరణం అనుకూలిస్తుంది. వేసవిలో పడిన వర్షాలకు పొలంలో వచ్చిన గడ్డి మొలకలను మరొకసారి దున్నాలి. ప్రభుత్వ అనుమతి ఉన్న షాపుల వద్ద విత్తనాలను కొనుగోలు చేసి, రసీదులు భద్రపరచాలి.

– పసునూరి వినయ్‌కుమార్, ఏఓ బోనకల్

విపత్తు నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు..



కల్లూరురూరల్: మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ సునీత



తల్లాడ: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి శివప్రసాద్



ఏన్కూరులో మాట్లాడుతున్న సాయినాథ్

కల్లూరురూరల్/తల్లాడ/బోనకల్/ఏన్కూరు: విపత్తు నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లయితే చర్యలు చేపట్టడం జరుగుతుందని కల్లూరు, తల్లాడ, బోనకల్, ఏన్కూరు మండల స్పెషలాఫీసర్లు సునీత, శివప్రసాద్, విజయభాస్కర్‌రెడ్డి, సాయినాథ్ తహసీల్దార్లు రమాదేవి, సురేష్‌కుమార్, పులి సాంబశివుడు, సీహెచ్.శేషగిరిరావు తెలిపారు. గురువారం కల్లూరు, తల్లాడ, బోనకల్, ఏన్కూరు మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన సమావేశాల్లో వారు పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం సీజన్‌లో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని.. ప్రజలకు, జంతువులకు ఎటువంటి ప్రాణహాని జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విపత్తు సమయంలో ప్రభుత్వం, సిబ్బంది ఆయా గ్రామాల్లో ఉండే విధంగా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు చంద్రశేఖర్, రమాదేవి, సురేష్‌బాబు, ఎంఈఓలు నివేదిత, దామాల పుల్లయ్య, వైద్యాధికారులు నవ్యకాంత్, స్రవంతి, రత్నమనోహర్, బి.రాములు, మౌనిక, ఎంపీఓలు రంజిత్‌కుమార్, శాస్త్రి, ఐకేపీ ఏబీఎస్ రాంబాబు, ఐకేపీ ఏపీఎం అశోకారాణి,ఏసీడీపీఓ అత్తమ్మ, సీడీపీఓ దయామణి, ఏఓలు నర్సింహరావు, తాజుద్దీన్, ఏపీఓ కోటయ్య, ఎంఈఓ దామోదరప్రసాద్, విద్యుత్ ఏఈ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

వరి, పత్తి విత్తనాలు ఇప్పుడే నాటొద్దు..

కల్లూరురూరల్: వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు ప్రస్తుత పరిస్థితుల్లో వరి, పత్తి విత్తనాలు నాటవద్దని కల్లూరు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు రైతులను కోరారు. వర్షాభావ పరిస్థితులతో వర్షాలు కురవకపోవడం వల్ల భూమిలో తేమశాతం లేదని, అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్న దృష్ట్యా ఈ పరిస్థితుల్లో పత్తి విత్తనాలు నాటినట్లయితే నాటినట్లైతే అవి మొలకెత్తే అవకాశం తక్కువ శాతం ఉంటుందని తెలిపారు.

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఈ నెల 4న 'సాక్షి'లో తాగునీటి కోసం మహిళలు ఆందోళన అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విధితమే. స్పందించిన మిషన్ భగీరథ డీఈ శ్రీనివాసరావు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. దీంతో కాలనీవాసుల తాగునీటి సమస్య పరిష్కారమైంది.

'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'



వేంసూరు: శంభునిగూడెంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం



తల్లాడ: కుర్నవల్లిలో మాట్లాడుతున్న వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రవికుమార్

వేంసూరు: రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ఆర్ ఈఏసీ మెంబర్ ఎం.యాదగిరి, అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని శంభునిగూడెం రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులు పంట కాలం పూర్తయ్యే వరకు భద్ర పరుచుకోవాలన్నారు. అదే విధంగా అయిల్ పాం సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ రాంమోహన్, ఏఈఓలు కావ్య, నవ్య, స్వాతి, రీమా పాల్గొన్నారు.

తల్లాడ: మండలంలోని కుర్నవల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వైరా కృషి విజ్ఞానకేంద్రం కోఆర్డినేటర్ కె.రవికుమార్ పాల్గొని మాట్లాడారు. తక్కువ యూరియా వాడి సాగు ఖర్చును తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాస్త్రవేత్త డా.వి.చైతన్య, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త ఎస్.ఎమ్. ఫణిశ్రీ, పశువైద్యాధికారి రాకేష్, తల్లాడ ఏఓ ఎండి.తాజుద్దీన్, ఉద్యానశాఖాధికారి నగేష్, ఏఈఓ త్రివేణి, రైతులు పాల్గొన్నారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో బాబాకి గురువారం ఆయా ఆలయాల అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. సాయినాధునికి కర్పూర హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల భక్తులు బాబాని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. సాయినాధుడి ఆలయాల్లో భజనలు చేసి గీతాలను ఆలపించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో మీనవోలు గ్రామానికి చెందిన గుర్రాల శివారెడ్డి – లక్ష్మీ దంపతులు భక్తులకు అన్నదాన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత..



రూ.30వేల నగదు అందిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య

వైరారూరల్: వైరా మండల సమాఖ్యలోని సిరిపురం క్లస్టర్ కోఆర్డినేటర్‌గా సీసీ తేజావత్ శ్రీనివాసరావు (48) తన స్వగ్రామమైన నేలకొండపల్లి మండలం, అజయ్‌తండా గ్రామంలో బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న డీఆర్‌డీఏ పీడీ సన్యాసయ్య గురువారం శ్రీనివాసరావు భౌతికాయానికి పూలమాలలతో నివాళులర్పించి ఆ శాఖ తరపున రూ.30 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డీపీఎం దర్గయ్య, హెచ్ఆర్ పి.రాజేష్, వైరా, నేలకొండపల్లి ఏపీఎంలు చిన్న వెంకటేశ్వర్లు, కిరణ్‌రాయి తదితరులు నివాళులు అర్పించారు.

గుండె పోటుతో బీజేపీ కోఆపరేటివ్ సెల్ జిల్లా కన్వీనర్..

తల్లాడ: మండలంలోని అంజనాపురంకు చెందిన బీజేపీ కోఆపరేటివ్ సెల్ జిల్లా కన్వీనర్ తేజావత్ బాలాజీ నాయక్(56) గుండె పోటుతో మృతి చెందాడు. గత నాలుగు రోజుల క్రితం ట్రాన్స్‌పోర్ట్ నిమిత్తం లారీపై బాలాజీ కలకత్తా వెళ్లాడు. కలకత్తాలో బుధవారం రాత్రి గుండె పోటు రావటంతో వెంటనే స్థానికులు అక్కడి ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మరణించాడు.

ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో ఆయన భౌతికకాయాన్ని గురువారం రాత్రి గ్రామానికి తీసుకొచ్చారు. బీజేపీ ఆధ్వర్యంలో గ్రామంలో బాలాజీ అంతిమ యాత్ర నిర్వహించారు. అంతిమ యాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వర్‌రావు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ రమేష్, రవీందర్, వీరంరాజు, వెంకటరామారావు, నాగులు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు పట్టివేత

వేంసూరు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు పట్టుకున్నారు. ఏపీలోని విజయవాడ నుంచి సత్తుపల్లికి రెండు లారీల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా.. పోలీసులు అందిన సమాచారం మేరకు గురువారం వేంసూరు మండలంలోని మర్లపాడు వద్ద ఆ లారీలను పట్టుకొని కేసు నమోదు చేశారు.

మొక్కలు నాటి సంరక్షించండి

ప్రపంచ పర్యావరణ దినోత్సవం



సత్తుపల్లి: అర్బన్‌పార్కులో మొక్కలు నాటుతున్న ఎఫ్‌డీఓ మంజుల



మధిర: కోర్టులో మొక్క నాటిన సీనియర్ సివిల్‌జడ్జి ప్రశాంతి

మధిర/సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అటవీశాఖ డివిజనల్ అధికారి మంజుల, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రశాంతి పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే సత్తుపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యాన స్థానిక వేశ్యకాంతల చెరువు కట్టపై మొక్కలు నాటగా.. సివిల్ జడ్జి మధిర కోర్టులో మొక్కలు నాటారు. అదే విధంగా మంజుల నీలాద్రి అర్బన్‌పార్క్‌లో మొక్కలు నాటి, అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మట్టా దయానంద్, దోమ ఆనంద్, మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహా, హౌసింగ్ ఏఈ పవన్, గాదె చెన్నారావు, చల్లగుళ్ల నర్సింహారావు, తోట సుజలరాణి, ఎండి కమల్‌పాషా, పింగళి సామేలు, దూదిపాల రాంబాబు, దొడ్డా శ్రీనివాసరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, స్వయం సహాయక సంఘాల మహిళలు, రేంజర్ స్నేహలత, డీఆర్ఓ ముత్యాలరావు, విచ్చేశ్వరరావు, ఎఫ్ఎస్ఓలు నర్సింహా, వేణుమాధవ్, నాగరాజు, కొండారెడ్డి, భాస్కర్, బీట్ ఆఫీసర్లు, ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరెడ్డి, డీఆర్ఓ వెంకటలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, కాపూరి రమేష్, ఎస్ జనార్దనరావు, నెల్లూరు రవి,ఎం సతీష్, పి శ్రీనివాస్, కోర్టు సూపరింటెండెంట్స్ సురేంద్ర మణి, సత్యనారాయణ, అటవీ అధికారులు, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, జేవీఆర్ ఓసీ పీఓ ఎనెవిఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసీ పీఓ వి.వి.నర్సింహారావు, రక్షణ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, బి.రాజేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠ



బోనాలతో వెళ్తున్న మహిళలతో ఎమ్మెల్యే రాగమయి



బోనాలతో తరలివస్తున్న మహిళలు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కాకర్లపల్లిలో మూడురోజుల నిర్వహించిన ముత్యాలమ్మ అమ్మవారు, పోతురాజు విగ్రహాల ప్రతిష్ఠ, నాభిశిలాంభిక (బొడ్రాయి) ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆడబిడ్డల రాకతో కాకర్లపల్లి సందడిగా మారింది. ముత్యాలమ్మ తల్లికి నైవేద్యం సమర్పించేందుకు మేళతాళాలతో వెళ్తున్న మహిళా భక్తులతో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కలిసి వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ నిర్వాహకులు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



అంజనాద్రి ఆలయంలో పూజలు జరుపుకుంటున్న నందిని, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు - బుచ్చిరెడ్డిపాలెం గ్రామాల మధ్యలో గుట్టపై ఉన్న శ్రీఅంజనాద్రి ఆలయాన్ని దాతల వితరణతో భక్తులు ఆలయ పునర్నిర్మాణం చేశారు. కాగా గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా అర్చకులు ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నేత, ఎన్ఆర్ఐ ఝాన్సీరెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొని పూజలు జరుపుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శీలం కవిత తదితరులున్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి



వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

చింతకాని: ఆలయ భూములను కౌలుకు చేస్తున్న రైతులందరూ ఆలయ అభివృద్ధికి సహకరించాలని దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం.అనీల్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో ఉన్నటువంటి శ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ఆవరణలో ఆలయానికి సంబంధించిన భూములకు గురువారం దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు కౌలు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. వేలం పాటలో పాల్గొన్న రైతులు 70 ఎకరాలను రూ.16,06,500 లకు ఏడాది పాటు కౌలు చేసుకోవచ్చని, గతేడాది కంటే రూ.3.26 లక్షల ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యండపల్లి శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి చుండూరు రామకోటేశ్వరరావు, ఆలయ అర్చకులు ఫణిహారం శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, భిక్షం, రామారావు, వెంకటనారాయణ, అరుణ, జూనియర్ అసిస్టెంట్ సిద్దల నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'తో శాశ్వత పరిష్కారం



తల్లాడ: బాలపేటలో వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు



చింతకాని: మాట్లాడుతున్న తహసీల్దార్ అనంతరాజు

వేంసూరు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందించిన భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం అవ్వడంతో పాటు రైతులకు మేలు జరుగుతుందని కల్లూరు ఆర్డీఓ రాజేంద్రగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కంచపర్తిలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

కల్లూరురూరల్: మండలంలోని పడమర లోకవరంలో తహసీల్దార్ పులి సాంబశివుడు ఆధ్వర్యంలో.. యజ్ఞనారాయణపురంలో డీటీ బాబ్జీ ఆధ్వర్యంలో గురువారం భూ భారతి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉమామహేశ్వరరావు, సుజాత, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

తలాడ: మండలంలోని బాలపేట, కుర్నవల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో 231 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ స్టాలిన్, ఆర్ఐలు భాస్కర్, ఖాజా మొయినుద్దీన్ పాల్గొన్నారు.

చింతకాని: మండల పరిధిలోని లచ్చగూడెం, రామకృష్ణాపురం గ్రామాల్లో గురువారం రైతులకు భూసమస్యలపై తహసీల్దార్ కూరపాటి అనంతరాములు అవగాహన కల్పించారు. లచ్చగూడెం గ్రామంలో 28, రామకృష్ణాపురం గ్రామంలో 92 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీటీ వీరభద్రనాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రఘు, జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: మండలంలోని పెద్దమండవ, కట్టకూరు గ్రామాల్లో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 215 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ సునీత తెలిపారు. కార్యక్రమంలో డీటీ లక్ష్మి, ఆర్ఐలు వహిదా సుల్తానా, ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: మండలంలోని ఇనగాలి, రామన్నపాలెం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 138మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని తహసీల్దార్ ఉషాశారద తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులున్నారు.